

రెమిడియల్ క్లాసుల పేరిట వేధింపులు సరికాదు

పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

భీమవరం : రెమిడియల్ క్లాసుల పేరుతో ఉపాధ్యాయులను వేధించడం సరికాదని పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 23న పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయని తెలిపారు. సుమారు 81.14 శాతం ఉత్తీర్ణత సాధించి మంచి ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. ఉత్తీర్ణులవ్వని 18.86 శాతం పిల్లలకు ఇప్పటికే సప్లిమెంటరీ పరీక్షలకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అయితే రెమిడియల్ క్లాసుల పేరుతో ఆర్‌సి నెంబర్ సిఎస్‌సి నెంబర్‌తో ప్రొసీడింగ్ ఇచ్చారని, ఇది ఉపాధ్యాయుల వేసవి సెలవులను నిరోధించడమేనని అభ్యంతరం తెలిపారు. ఉపాధ్యాయులను ఇతర ఉద్యోగులతో పోల్చరాదని, ఉపాధ్యాయులను మండు వేసవిలో వేధించకుండా ప్రొసీడింగ్స్ ఉపసంహరించాలని విద్యాశాఖా కమిషనర్ విజయరామరాజును కోరారు.

కాలువల్లో నీరు పారేదెలా..!

- డెల్టా ఆధునికీకరణ పనులపై నిర్లక్ష్యం
- ఈ ఏడాదీ తాత్కాలిక ఓఅండ్ఎం పనులతోనే సరి
- ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వ ఆమోదం కరువు
- ప్రభుత్వాలు మారినా ఆధునికీకరణపై అదే తీరు
- జూన్ మొదటి వారంలో కాలువలకు సాగునీరు విడుదల
- కొల్లేరు పంట కాలువల్లో ఆధునికీకరణ పనులు ఎలా?



ఉండి మండలం వెంకయ్య వయ్యేరు కాలువ ఇలా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

డెల్టా ఆధునికీకరణపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. వైసిపి ప్రభుత్వం తీరులోనే కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. దీంతో ఈ ఏడాది కాలువల్లో పూడిక తీసే పనులు 'ఎక్కడి వేసిన గొంగళి అక్కడే' అన్నట్లు పరిస్థితి తయారైంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో గోదావరి నుంచి వచ్చే నీటితో దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో ఆయకట్టు సాగవుతోంది. 11 ప్రధాన కాలువలు, 300కుపైగా పిల్ల కాలువల ద్వారా సాగునీటి సరఫరా సాగవుతోంది. 2007లో దాదాపు రూ.1400 కోట్లతో ప్రారంభించిన డెల్టా ఆధునికీకరణ పనులు నేటికీ సగం కూడా పూర్తి కాని పరిస్థితి నెలకొంది. గత ఐదేళ్ల వైసిపి పాలనలో కాలువల పూడికతీత పనులు పూర్తిగా పడకేశాయి. దీంతో పంట కాలువలు మెరకతేరిపోయి చిన్నపాటి వర్షానికి సైతం పంట పొలాలు మునుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం రావడంతోపాటు ఇరిగేషన్ మంత్రిగా జిల్లాకు చెందిన నిమ్మల రామానాయుడు ఉండటంతో ఆధునికీకరణ పనులు చకచకా సాగిపోతాయని అంతా భావించారు. పరిస్థితి మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా మారింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో డెల్టా ఆధునికీకరణ పనులకు సంబంధించి దాదాపు రూ.400 కోట్లకుపైగా నిధులు అవసరమవుతాయని ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వ ఆమోదం కోసం పంపించారు. మే నెల వచ్చినా ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆమోదమూ రాలేదు. దీంతో ఆధునికీకరణ పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. తాత్కాలిక ఓఅండ్ఎం పనులు మాత్రమే సాగుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో రూ.11 కోట్లకు సంబంధించిన పనులు మాత్రమే సాగుతున్నాయి. ఏలూరు జిల్లాలోనూ అదే పరిస్థితి నెలకొంది. ఏప్రిల్ 27న కాలువలకు నీరు నిలుపుదల చేశారు. నిబంధనల ప్రకారం కాలువలకు నీటిని నిలుపుదల చేసే సమయానికి టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభిస్తే నెల రోజులకుపైగా పనులు సాగే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ప్రతియేటా జూన్ ఒకటో తేదీన కాలువలకు నీరు విడుదల చేస్తోంది. మే నెలలోనే ఆధునికీకరణ పనులు చేసే అవకాశం ఉంది. అధికారుల ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేయకపోవడంతో ఈ ఏడాది ఆధునికీకరణ పనులు లేకుండాపోయాయి.

ప్రతియేటా వేల ఎకరాల్లో పంటనష్టం

పంట కాలువలు పూడిపోవడంతో ప్రతియేటా వేల ఎకరాల్లో పంటనష్టం జరుగుతోంది. గడిచిన ఖరీఫ్‌లోనూ దాదాపు 16 వేల ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు అధికారులు తేల్చారు. దీనికి ప్రధాన కారణం ఆధునికీకరణ జరగకపోవడమే. కాలువలు మెరకదేరిపోవడంతో వర్షాలకు పంట పొలాల్లోంచి నీరు కిందకు పారడం లేదు. రోజుల తరబడి పొలాల్లోనే ఉండిపోతున్నాయి. దీంతో పంట కుళ్లిపోయి దెబ్బతింటుంది. రైతులు పెద్దఎత్తున నష్టపోతున్నారు. రైతుల కష్టాలను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వచ్చే ఏడాది సైతం రైతులు కష్టాలు ఎదుర్కోక తప్పదని స్పష్టమవుతోంది.

కొల్లేరులో పంట కాలువల్లో పనులపై ఆంక్షలు

కొల్లేరును ఆనుకుని ఉన్న గ్రామాల్లోనూ పంట కాలువల ద్వారా నీరంతా కొల్లేరులోకి వెళ్తోంది. వర్షపు నీరంతా కాలువల ద్వారా కొల్లేరులోకి చేరి ఉప్పుటేరు గుండా సముద్రంలోకి చేరుతోంది. కొల్లేరులో కాలువలు పూడుకుపోవడంతో వరద నీరు కిందకు దిగక పంట పొలాలు దెబ్బతింటున్నాయి. రబీలోనూ కాలువల్లో నీరు కిందకు పారక నీటి ఎద్దడి సమస్యతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాదైనా కొల్లేరులో ఉన్న పంట కాలువల్లో ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. కొల్లేరు కాంటూరు లెక్కలు చెప్పి ఫారెస్ట్ అధికారులు దీన్ని అడ్డుకుంటున్నారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కొల్లేరులోని పంట కాలువల్లో పూడిక తీయకపోతే వచ్చే ఖరీఫ్, రబీల్లో సైతం తీవ్ర ఇబ్బందులు తప్పవని, కొల్లేరులోని పంట కాలువల్లో ఆధునికీకరణ పనులు చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం తగిన చర్యలు వెంటనే తీసుకోవాల్సి ఉంది.

జుత్తిగ రైతుసేవా కేంద్రానికి కౌలురైతులు తాళం

వెంటనే గోనె సంచులు ఇవ్వాలని నిరసన



ఆర్ఎస్‌కె వద్ద సంచుల కోసం వేచి ఉన్న రైతులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ధాన్యం పట్టుబడికి అవసరమైన గోనె సంచులు వెంటనే ఇవ్వాలని, ధాన్యం తూకాల్లో మోసాలను అరికట్టాలని కోరుతూ ఏపి కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో కౌలురైతులు శనివారం మధ్యాహ్నం పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలంలోని జుత్తిగ గ్రామంలోని రైతుసేవా కేంద్రానికి తాళం వేశారు. ధాన్యం మాసూలు చేసి రోజులు గడుస్తున్నా రైతుసేవా కేంద్రంలో గోనెసంచులు ఇవ్వడం లేదని కౌలురైతులు వాపోయారు. ఈ విషయం తెలియగానే తహశీల్దార్ వై.రవికుమార్, మండల వ్యవసాయాధికారి ఎ.జ్యోషిత అక్కడికి చేరుకుని కౌలురైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు అధికారులతో మాట్లాడుతూ ఒకపక్క వాతావరణం బాగోలేదని, దీంతో రైతులు ధాన్యం మాసూలు చేసి రోజులు తరబడి సంచుల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. రైతుసేవా కేంద్రంలో సిబ్బంది సరైన సమాధానం చెప్పడం లేదని, పిఆర్ 126 రకం బయట అమ్ముకోండని చెప్పడం దారుణమని అన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ ధాన్యం తూకాల్లో సంచికి అదనంగా ధాన్యం తీయడం, తేమ, నూకశాతం పేరుతో దోచుకుంటూ మిల్లర్లు వేలాది రూపాయలు కట్టించుకుంటున్నారని ఆరోపించారు. తక్షణం మిల్లర్ల దోపిడీని ఆపాలని, పూర్తిస్థాయిలో సంచులు ఇచ్చి వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయాధికారి వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లగా గోనె సంచులు పంపుతున్నామని సమాచారం ఇచ్చారని తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌలురైతులు, రైతులు గుత్తుల వెంకటేశ్వరరావు, బొక్కా రాము, కర్రి వెంకటరెడ్డి, గొలుగూరి భాస్కరరెడ్డి, కడలి బాలకృష్ణ, సత్తు మల్లేశ్వరరెడ్డి, గుత్తుల పురుషోత్తం, కర్రి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువు తవ్వకం ఆపాలి

సిపిఎం బృందం



నిరసిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - కాళ్ల

ఏలూరుపాడులో తాగునీటి చెరువుకు సమీపంలో తవ్వుతున్న చేపల చెరువు పనులను తక్షణం నిలుపుదల చేయాలని సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఏలూరుపాడులోని తవ్వుతున్న చేపల చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ ఏలూరుపాడులో 10 వేల మంది జనాభాకు తాగునీరు అందిస్తున్న పంచాయతీకి చెందిన తాగునీటి చెరువు పక్కనే చేపల చెరువు తవ్వకానికి అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఈ చేపల చెరువుల తవ్వకం పూర్తయిదే ఇక ఏలూరుపాడు ప్రజలకు కలుషిత నీరే దిక్కవుతుందన్నారు. ఫలితంగా ప్రజలు కిడ్నీ, కేన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు గురవుతారన్నారు. ఈ నెల ఒకటో తేదీన ప్రజలు ఈ ఆక్వా చెరువు తవ్వకానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఆందోళన చేసినా పనులు ఆపకపోవడం దారుణమన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా పెద్దల ఆదాయమే చూస్తున్నారని ఎద్దేవా చేశారు. నీటి కాలుష్యంపై మాట్లాడుతున్న ఉండి ఎంఎల్ఎకు ఈ చెరువు తవ్వకం విషయం తెలియదా అని అన్నారు. ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు జోక్యం చేసుకుని తక్షణం ఈ చెరువు తవ్వకం పనులను నిలుపుదల చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుమాని శ్రీనివాస్, వాతాడి జేజి, గండికోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

20న దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి

సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు



మాట్లాడుతున్న చింతకాయల బాబూరావు

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 20న నిర్వహించబోయే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చింది. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక, కౌలురైతుల ఉమ్మడి సమావేశం రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడారు. వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టడం కోసం ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అమెరికా నుండి వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతికి అగ్రిమెంట్ చేసుకోవడానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. కౌల్దారీ చట్టం, ఉపాధి కూలీకి రూ.600 వేతనం, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ పోరాటం సాగించాలన్నారు. గ్రామీణ హర్తాళ్లలో కార్మికులు, రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు, ఇతర ప్రజానీకం పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొనాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవరావు



ఆవిష్కరణలో పాల్గొన్న కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి - భీమవరం

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో హమాలీ కార్మికుల విస్తృత సమావేశం కె.సత్యనారాయణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 10 జాతీయ కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేసి నిరుద్యోగాన్ని పెంచుతుందన్నారు. పెరుగుతున్న ధరలు అరికట్టాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులకు సమగ్ర కార్మిక చట్టం రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమ్మె పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో యూనియన్ నాయకులు కొత్తల సత్యనారాయణ, కురిటి సోమేశ్వరరావు, కె.వెంకట్రావు, కడలి వెంకటరమణ, జై.జనార్దన్‌రావు, సిహెచ్.కోటేశ్వరరావు, కముజు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అసంఘటిత రంగ కార్మికుల హక్కుల పరిరక్షణకు అధికారులు చర్యలు చేపట్టాలని, ప్రతి ఒక్క అసంఘటిత కార్మికుడిని ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయించడం ద్వారా ఇన్సూరెన్స్ అందేలా చర్యలు తీసుకోవాలని భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, సంస్థ చైర్మన్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.లక్ష్మీనారాయణ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మే 1 నుంచి 7 వరకూ అసంఘటిత రంగ కార్మికులకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శనివారం స్థానిక 3వ అదనపు జిల్లా కోర్టులో మున్సిపల్, లేబర్, మండల పరిషత్, ఆరోగ్య, విద్య, పోలీసు శాఖల అధికారులతో లక్ష్మీనారాయణ సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) జి.సురేష్ బాబు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురవుతున్నారని, బిల్డర్లకు ప్లాను మంజూరు చేసేటప్పుడే కార్మికులకు ప్రమాదాలు జరగకుండా నివారణా చర్యలు తీసుకునే విధంగా పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ముందుగా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎ.లక్ష్మి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు 4.5 లక్షల మంది అసంఘటిత కార్మికులు ఉన్నారని, అందులో సుమారు 2.5 లక్షల మంది వ్యవసాయ రంగానికి చెందినవారని, వారందరినీ గ్రామ సచివాలయాల ద్వారా ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయించుటకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు పట్టణంలో ఒక షెల్టర్‌ను ఏర్పాటు చేసి కార్మికులు అవసరమైన వారు ఆ షెల్టర్ వద్దకు వస్తే అక్కడే కార్మికులు లభ్యమయ్యేలా షెల్టర్ నిర్మించే విధంగా ప్రణాళికలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం డిప్యూటీ ఎంపిడిఒ జ్ఞానేశ్వర్ రావు, గవర్నమెంట్ డాక్టర్ ఎస్.సాయి కిరణ్మయి, వన్ టౌన్ సిఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నరసాపురం : మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మున్సిపల్ శానిటరీ వర్కర్స్ కి న్యాయ అవగాహన కార్యక్రమానికి నిర్వహించారు. స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు చేగొండి బాలాజి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్క శ్రామికుడు కార్మిక చట్టాలను, ఉచిత న్యాయ సహాయం గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్యానెల్ లాయర్స్ కె.చిట్టి పద్మజ, కె.శిరీష, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, శానిటరీ వర్కర్స్, వార్డు సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలి

ఎంఎల్‌సి గోపీమూర్తి



ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న ఎంఎల్‌సి, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - కాళ్ల

పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించడం ద్వారా చదువులో మొదటి మెట్టును దిగ్విజయంగా పూర్తిచేసుకున్న విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. శనివారం యుటిఎఫ్ కాళ్ల మండల శాఖ ఆధ్వర్యంలో కోపల్లె హైస్కూల్లో పదోతరగతి ప్రతిభావంతులకు పురస్కారాలు అందించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. జీవితంలో మొదటి 25 సంవత్సరాలు కష్టపడి చదివి ఉన్నత స్థానాలు పొందడం ద్వారా తల్లిదండ్రులకు సహాయపడటమే కాకుండా సమాజానికి కూడా సేవ చేయాలని ఆయన కోరారు. మరో ముఖ్యఅతిథి జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణ మాట్లాడుతూ హక్కుల కోసం పోరాడడంతోపాటు పాఠశాల ఎన్రోల్మెంట్ పెంచడానికి కృషి చేయడం, అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరించడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచి విషయమని చెబుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న యుటిఎఫ్ కాళ్ల మండల శాఖను అభినందించారు. కాళ్ల మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన మండలంలోని తొమ్మిది ఉన్నత పాఠశాలలో ప్రతి పాఠశాల నుంచి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులు మొత్తం 18 మందిని యుటిఎఫ్ కాళ్ల మండల శాఖ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన జి.కనకరాజు రిటైర్డ్ ఎంఇఒ-2, పొదిల రామకృష్ణ రిటైర్డ్ ఎల్ఎఫ్ఎల్‌హెచ్‌ఎం, టికెబి మెమెంటోస్ భీమవరంకి కాళ్ల మండల యుటిఎఫ్ పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీదేవి, డివైఇఒ ఎన్.రమేష్, ఎంఇఒ-1 ఎ.రవీంద్ర, ఎంఇఒ-2 వేంద్ర వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బిఆర్ఎం కోటేశ్వరస్వామి, ఎం.శంకర్రావు, పలు పాఠశాలల హెచ్ఎంలు సుబ్బరాజు, రవికుమార్ రాజు, రవిచంద్రకుమార్, రామ్మూర్తి రాజు, యుటిఎఫ్ నాయకులు కనకదుర్గ, మణి, తిరుమల రావు, విష్ణు ప్రసాద్ కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు మురళీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి




మృతదేహం వద్ద రోధిస్తున్న బంధువులు

ఉండి : గుండెపోటుతో ఉపాధి హామీ కూలీ మృతిచెందిన సంఘటన మండలంలోని మహదేవపట్నం పంచాయతీ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం టెక్నికల్ అసిస్టెంట్ లంకపల్లి ఒమేగా రాజు మాట్లాడుతూ మహదేవపట్నం గ్రామపంచాయతీ పరిధిలోని పృథ్వీరాజు పొలంలో శనివారం ఉదయం ఉపాధి హామీ కూలీలు పనిచేస్తుండగా గ్రామానికి చెందిన కాలా సూర్యారావు(76) గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోగా తోటి శ్రామికులు దగ్గరలోని ఆర్ఎంపి వైద్యునికి సమాచారం అందివ్వగా ఆయన వచ్చి పరీక్షించేసరికి సూర్యారావు మృతిచెందాడని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా విషయం తెలుసుకున్న తాను వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సూర్యారావు మరణం వార్త జిల్లా డ్వామా అధికారికి తెలియజేశానని, సూర్యారావు కుటుంబానికి ప్రభుత్వం ద్వారా రావాల్సిన ఇన్సూరెన్స్ వచ్చే ఏర్పాట్లు చేస్తానని జిల్లా అధికారి హామీ ఇచ్చినట్లు ఒమేగా రాజు తెలిపారు. సూర్యారావుకు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారని, ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి సంతాపం తెలియజేశారు.

ఉండిలో పేదల ఇళ్లు ధ్వంసం తగదు

- ప్రతి కుటుంబానికీ మూడు సెంట్లు స్థలమిచ్చి ఇల్లు నిర్మించాలి
- కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులు మానుకోవాలి
- వైసిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు



బాధితునితో మాట్లాడుతున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి - భీమవరం

పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్లను అన్యాయంగా ధ్వంసం చేస్తున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు విమర్శించారు. అభివృద్ధికి వైసిపి అడ్డు కాదని, కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులు మానుకోవాలని చెప్పారు. గొల్లలకోడేరులో ఇటీవల తొలగించిన వ్యాపార సముదాయాల ప్రాంతాన్ని వైసిపి బృందం శనివారం పరిశీలించింది. అనంతరం వైసిపి ముఖ్యనేత చేకూరి రాజా నరేంద్రరాజు స్వగృహంలో ప్రసాదరాజు విలేకరులతో మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో ఆక్రమణలు తొలగించామని, అయితే వారికి తొలుత ఇళ్ల స్థలిలాచ్చాకే తొలగించామని గుర్తు చేశారు. అయితే ఉండిలో మాత్రం కనీసం నోటీసులు ఇవ్వకుండా, చెప్పకుండా తొలగిస్తుండటంతో ఎంతోమంది నిరుపేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఎంతోమంది నిరుపేదలకు జగనన్న పేరుతో ఇళ్ల స్థలాలు ఇచ్చామని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎంతమందికి ఇళ్లు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. ఒకవేళ ఇళ్లు తొలగిస్తే ఇంటి స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అధికార బలం ఉందని నిరుపేదలను ఇబ్బందులకు గురిచేయడం కాదని విమర్శించారు. అవసరానికి ఆక్రమణలు సహజమని, అవసరం లేకున్నా ఆక్రమణలు తొలగించడం దారుణమని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. అనేక ప్రాజెక్టులు పెండింగులో ఉన్నాయన్నారు. తాగు, సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, డెల్టా ఆధునికీకరణకు రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. రోడ్లు సదుపాయం, మౌలిక వసతుల కల్పన ఎక్కడికక్కడే నిలిచిపోయాయని విమర్శించారు. వైసిపి అభివృద్ధిని కోరు కుంటుందిగానీ కక్ష సాధింపును కాదని స్పష్టం చేశారు. పేదలపై జులుం చూపించడం సరైంది కాదన్నారు. అర్హతున్నా ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం ఇచ్చి ఇంటిని నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధాన్యానికి గిట్టుబాటు ధర లేదని, ఆక్వా ఫీడ్, సీడ్ ధరలు విపరీతంగా ఉన్నాయని, నియంత్రించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవట్లేదని అన్నారు. అధికారం ఉన్నా, లేకున్నా వైసిపి ప్రజల పక్షాన పోరాడుతుందని చెప్పారు. హామీలను అమలు చేయకుండా వైసిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ అరాచక పాలన సాగిస్తుందని విమర్శించారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పి ముఖం చాటేసిందన్నారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్‌పై బురద చల్లి, తిరిగి అదే యాక్టు కొనసాగిస్తున్నారని విమర్శించారు. డెల్టా ప్రాంతంలో కాలువలు, డ్రెయిన్లు, రోడ్లు వెంబడి ఆక్రమణలు ఉండటం సహజమేనన్నారు. తమ ప్రభుత్వం సెంటున్నర స్థలం ఇస్తే చనిపోతే సమాధికి కూడా పనికిరాదని విమర్శించారని, మూడు సెంట్లు ఇస్తామని ఇచ్చిన హామీని అమలు ఏమైందని ప్రశ్నించారు. ఉదయం చెప్పి మధ్యాహ్నానికి ఇళ్లు తొలగించడం దారుణమని, వారందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్దాక్షిణ్యంగా ఇళ్లు తొలగిస్తే వారు ఎక్కడికి వెళ్లి ఎలా బతుకుతారని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం 32 లక్షల ఇళ్లు కట్టించిందని, పది నెలల కాలంలో మీరు ఎన్ని ఇళ్లు కట్టించారని ప్రశ్నించారు. ఆక్వా రైతులు క్రాప్ హాలిడే ప్రకటించే స్థితికి వచ్చారంటే సిగ్గుపడాలన్నారు. ధాన్యానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో దళారీ వ్యవస్థ రాజ్యమేలుతుందని విమర్శించారు. ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహారాజు మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో నిరుపేదలకు ప్రత్యామ్నాయం చూపించకుండా ఇళ్లు తొలగిస్తున్నారని చెప్పారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో ఇళ్లు కట్టించి పేదలకు ఇచ్చామని గుర్తు చేశారు. అవసరం లేకపోయినా పేదల ఇళ్లను తొలగించడం దారుణమన్నారు. ఇళ్లు తొలగించిన పేదలకు టిడిపి మేనిఫెస్టో ప్రకారం మూడు సెంట్లు స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ, నాయకులు చేకూరి రాజా నరేంద్రరాజు, పేరిచర్ల విజయ్‌బాబు, బంధన పూర్ణ పాల్గొన్నారు.

లెనిన్ అంటే క్రీడోత్సవాల సంబరాలే

వర్ధంతి సభలో డివైఎఫ్‌ఐ నాయకులు




లెనిన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న డివైఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి - ఆకివీడు

లెనిన్ మన మధ్య లేరని తలుచుకుంటేనే చాలా బాధగా ఉందని, ఆయన పేరు చెబితే సంక్రాంతి యువజనోత్సవాలు, క్రీడోత్సవాల సంబరాలే గుర్తొస్తుందని డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి జి.ధనుష్, ఉపాధ్యక్షులు బి.రాంబాబు అన్నారు. మారుబోయిన లెనిన్ బాబు 4వ వర్ధంతి సందర్భంగా శనివారం ప్రజాసంఘాల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ యువజన ఉత్సవాలను ఆయన ముందుండి నడిపించే వారన్నారు. కార్యకర్తలకు కష్టం వచ్చిన సహకారం అందించి సేవ కార్యక్రమాల్లో కూడా సహాయం చేసే వారన్నారు. ఆయన లేకపోవడం మాకు చాలా బాధాకరం, ఆయన లేని లోటు తీరనిదని తెలిపారు. ఈ కార్యాక్రమంలో కె.తవిటినాయుడు, షేక్ వల్లి, బి.వర్మ, సందక సూరిబాబు, బి.కళ్యాణి, ఎల్. బలరాం, జి.రాంబాబు, ఎస్.మిన్నరావు, రమేష్ పాల్గొన్నారు.

వేగంగా రాష్ట్రాభివృద్ధి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - నరసాపురం



ప్రారంభోత్సవంలో ఎంఎల్ఎలు

సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధి వేగంగా జరుగుతోందని పిఎసి కమిటీ చైర్మన్, భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు అన్నారు. శనివారం మండలంలోని కొప్పర్రు గ్రామంలో ఇరువురు పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. కొప్పర్రు గ్రామంలోని రూ.48 లక్షలతో నిర్మించిన 4 అంగన్వాడీ కేంద్రాలను, జల జీవన్ మిషన్ నిధులతో రూ.86.10 లక్షలతో నిర్మించిన ఫిల్టర్ బెడ్ల ప్రారంభోత్సవం, రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త, జనసేన నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్ స్వగృహంలో ఇరువురు ఎంఎల్ఎలను ఘనంగా సత్కరించారు. ఎల్బి చర్ల గ్రామంలో రూ.16 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని, రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ ఈ అభివృద్ధి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చే దిశగా ముఖ్యమైన అడుగులుగా నిలవనున్నాయి. ప్రభుత్వ సంకల్పంతో ప్రజల నిత్యజీవితాన్ని మెరుగుపర్చేలా ఈ పనులు చేపట్టడం గర్వకారణమని నాయకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి పొత్తూరి రామరాజు, ఆకన చంద్రశేఖర్, వాతాడి ఉమా, బొక్క రాధాకృష్ణ, సోనీ, వలవల నాని, ప్రత్తి లక్ష్మీ సంపూర్ణ, రావూరి సురేష్, మైల వసంతరావు, కటకంశెట్టి సంజీవరావు, నిప్పులేటి తారకరామారావు పాల్గొన్నారు.

డెంగీ, మలేరియాపై అవగాహన కల్పించాలి

మలేరియా అధికారి లక్ష్మణరావు

గణపవరం : గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సచివాలయంలో ఉన్న స్థానికులకు మలేరియా, డెంంగీపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు అన్నారు. శనివారం గణపవరం పిహెచ్సిని సందర్శించి స్థానిక డాక్టర్ పి.కిరణ్మయితో మాట్లాడారు. అనంతరం ల్యాబ్లో మలేరియా టెస్టులు ఏవిధంగా జరుగుతున్నవి అని రికార్డులను పరిశీలించారు. సరిపల్లి సచివాలయంలో వైద్యసిబ్బంది ఫీవర్ సర్వే ఎలా జరుగుతుందని ఎన్సిడి సర్వేపై అడిగి తెలుసుకున్నారు. ప్రతి శుక్రవారం పొడి శుక్రవారంగా పాటించాలని ఆశాలకు ఎఎన్ఎంలకు తెలియజేశారు. వైద్యసిబ్బంది ఇంటింటా జరిపే ఎన్సిడి సిడి స్క్రీనింగ్ టెస్టులకు స్థానికులు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్బాబు, ఆరోగ్య కార్యకర్తలు ఎన్.నాగవేణి, పిఎస్.వల్లి, ఎం.సునందర యేహాన్ పాల్గొన్నారు.

దళిత క్రిస్టియన్లను ఎస్సిలుగా గుర్తించాలి

అంబేద్కర్ ఆలోచన వేదిక డిమాండ్

పెనుమంట్ర : దళితులు క్రిస్టియన్ మతంలోకి మారిన మరుక్షణం ఎస్సి హోదా కోల్పోతుందని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు దురదృష్టకరమని, దళిత క్రిస్టియన్లను ఎస్సిలుగా గుర్తించాలని అంబేద్కర్ ఆలోచనా వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చవ్వాకుల విఆర్.భరత్ కుమార్ కోరారు. శనివారం సాయంత్రం ఆయన పత్రికల వారితో మాట్లాడుతూ ఏమతంలోకి మారినా దళితులు ఇప్పటికీ అంటరానితనానికి, వివక్షతకు గురవుతూనే ఉన్నారన్నారు. క్రిస్టియానిటీ కులాన్ని గుర్తించకపోయినా కులవివక్ష కొనసాగుతుందని అనేక నివేదికలు వెల్లడించాయని ఆయన అన్నారు. మన దేశంలో కులం, మతంపై ఆధారపడలేదని, అది వ్యవస్థీకృతమై ఉందని, కులం పునాదుల్ని తొలగించడానికి అవసరమైన రాజకీయ, ఆర్థిక, సామాజిక చర్యల్ని తీసుకోవాలని, కాబట్టి దళిత క్రిస్టియన్లను ఎస్సిలుగా గుర్తించాలన్నారు. అందుకు అవసరమైన చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అంబేద్కర్ ఆలోచన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హోదాలో ఆయన డిమాండ్ చేశారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు

తాడేపల్లిగూడెం : పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు మేధాశక్తిని పెంపొందించుకోవాలని గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థుల శిక్షణ తరగతులకు రిసోర్స్ పర్సన్ ప్రత్తి వీరాస్వామి విద్యార్థులకు కథలు చెప్పడం, చదివించడం జరిగింది. ఎ.జనార్ధనరావు పిల్లలకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు విద్యార్థులకు సంగీతం, నృత్యం, కళలు గురించి బోధించారు. గరికపాటి బాపయ్య శర్మ జనరల్ నాలెడ్జ్ బోధించారు. విద్యార్థులకు ఈవేసవి శిక్షణ తరగతులపై రిసోర్స్ పర్సన్స్ చెప్పిన పాఠాలపై పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల విద్యార్థులకు చివరిలో బహుమతులు అందజేయబడునని గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం జరిగిన వేసవి శిక్షణ తరగతులకు 45 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్పర్సన్స్ ప్రత్తి వీరాస్వామి, కొప్పెల్ల శ్రీనివాస్, ఎ.జనార్ధన్ రావు, గరికపాటి బాపయ్య శర్మ, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమంట్ర : ఒరుగామి అనే పేపర్ క్రాఫ్ట్ నేర్పడం ద్వారా స్కిల్స్ డెవలప్మెంట్ అవుతాయని విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయిని పడాల సువర్ణ గౌరి అన్నారు. శివారం మార్టేరు గ్రామ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో పిల్లలకు పేపర్ క్రాఫ్ట్ మీద ఆమె అవగాహన కల్పించారు. ఉదయం స్థానిక రామకృష్ణ సమితిలో మానవత ఆధ్వర్యంలో విశ్రాంత తహశీల్దార్ చిర్ల సూర్య నారాయణ రెడ్డి, శ్రీరామకృష్ణ పిల్లలకు భగవద్గీత శ్లోకాలు, అర్థాలు వివరించారు. ఈ విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు ఎం.కార్తీక్ స్వరూప్ రెడ్డి, డి.జయంత్, జస్వంత్, కె.తనుజ, ఎస్.లిఖిత్, ఎస్.లోహిత, ఎ.అనీష్, ఎస్.గంగశ్రీ, వై.నిహాల్, డి.సాధన్విత, పి.దక్షిత, ఎ.రమేష్, కె.దినేష్ వినయ్ పాల్గొన్నారు.

ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుపై వడ్డీ రాయితీ

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం పట్టణ ప్రజలు ఆస్తి పన్ను, ఖాళీస్థలం పన్నుపై 2025-26 ఆర్థిక సంవత్సరానికి మే 1వ తేదీ నుంచి జూన్ 30 వరకు వడ్డీ లేకుండా చెల్లించవచ్చు అని తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పన్ను మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలో ఒకేసారి జూన్ 30 లోపు చెల్లించే వారికి మాత్రమే వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. ప్రజలు పన్ను చెల్లింపుదారులు ఆస్తిపన్ను, ఖాళీ స్థలం పన్ను బకాయిలను చెల్లించి వడ్డీ లేకుండా పన్ను చెల్లింపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. పన్నులను పురపాలక సంఘ కార్యాలయ కౌంటర్లలో గాని, వార్డు సచివాలయాలలో గాని, ఆన్లైన్ ద్వారా (%https://cdma.ap.gov.in%) చెల్లించవచ్చునన్నారు. చెక్కులు, డీడీలు, నెఫ్ట్ ద్వారా చెల్లించదలచిన వారు పురపాలక సంఘ కార్యాలయంలో నేరుగా చెల్లించి రశీదు పొందవచ్చునని కమిషనర్ తెలియజేశారు.

మోడీ సభకు వెళ్లి వస్తున్న బస్సుల ఢీ

డ్రైవర్, సిబ్బందికి గాయాలు

నరసాపురం : మండలంలోని సీతారామపురం గ్రామంలో 216 జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున రెండు బస్సులు ఢీకొన్నాయి. పిఎం మోడీ అమరావతి సభకు వెళ్లి వస్తున్న రాజోలు డిపో బస్సు బ్రేక్ డౌన్ అవ్వడంతో రోడ్డుపై నిలిపివేశారు. అదే మీటింగ్కి వెళ్లి తిరిగి వస్తున్న రాజోలు డిపో బస్సు ఆగి ఉన్న బస్సును వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ ఎస్.ఎస్.మూర్తి, మెకానిక్ ప్రసాద్, శ్రీనివాస్, జి.ఎస్.ఎస్.స్వల్ప సిబ్బందికి గాయాలు అయ్యాయి. వైద్యం నిమిత్తం 108లో హుటాహుటిన నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో బస్సులు పూర్తిగా డ్యామేజ్ అయ్యాయి.

ఇంగ్లీష్ భాషపై పట్టు ప్రగతికి మెట్టు

ప్రముఖ శాస్త్రవేత్త పద్మశ్రీ ఎంఆర్.రాజు

భీమవరం : ఇంగ్లీష్ భాషపై పట్టు ప్రగతికి తొలిమెట్టని ప్రముఖ శాస్త్రవేత్త పద్మశ్రీ ఎంఆర్.రాజు అన్నారు. స్థానిక డిఎన్ఆర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ గ్రామర్ శిక్షణ తరగతులు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు ముఖ్య అతిథిగా ప్రముఖ శాస్త్రవేత్త ఎంఆర్.రాజు పాల్గొని మాట్లాడారు. వసుధ ఫౌండేషన్ చైర్మన్ వెంకటరామరాజు శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధికి ఇంగ్లీష్ అవసరమన్నారు. అనంతరం విద్యార్థులకు ఇంగ్లీష్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కన్వీనర్ ప్రసాదరాజు, హెచ్ఎం పాల్గొన్నారు.

అమరావతి సభ విజయవంతం : ఎంఎల్ఎ


తణుకు : నాటి ఘన చరిత్ర పునరావృతం అయ్యేలా, నవ్యాంధ్ర ప్రగతి ప్రజా రాజధాని అమరావతి పునఃప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్కళ్యాణ్ ఆధ్వర్యంలో జరిగిన శంకుస్థాపన అత్యంత వైభవంగా విజయవంతం అయ్యిందని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

అసాధారణ ఫలితాలు.. ఆదిత్య సొంతం

మల్టీ నేషనల్ కంపెనీలచే క్యాంపస్ ఇంటర్వ్యూలు
అద్భుతమైన ప్లేస్మెంట్స్
ప్రిన్సిపల్ పి.లక్ష్మి సరోజ



ఆదిత్య డిగ్రీ కాలేజ్



ఛైర్మన్ శేషారెడ్డి, సెక్రటరీ సుగుణరెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీసరోజ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

1984లో కాకినాడలో డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి ఆధ్వర్యాన ఒక సాధారణ విద్యాసంస్థగా ఆదిత్య కళాశాల ప్రారంభమైంది. గత 41 ఏళ్లలో దినదినప్రవర్ధమానం చెందుతూ ఉభయగోదావరి జిల్లాల్లోనే 33 కళాశాలలుగా విస్తరించిందంటే అతిశయోక్తి కాదు. రానున్న రోజుల్లో మార్కెట్లో అవకాశాలు, అవసరాలను ముందుగానే అంచనా వేసి నూతన కోర్సులు, సరికొత్త విధానాలతో ముందుకు సాగడం ఆదిత్య విద్యాసంస్థల ప్రత్యేకతగా చెప్పొచ్చు. ఈ క్రమంలోనే ఆదిత్య డిగ్రీ కళాశాల 2017లో జిల్లా వాణిజ్య కేంద్రమైన తాడేపల్లిగూడెంలో ప్రారంభించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ పి.లక్ష్మీసరోజ తెలిపారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణరెడ్డి, డైరెక్టర్ కె.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో విద్యాబోధన సాగిస్తూ ప్రతి సంవత్సరం తమ విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులవుతున్నారని ఆమె వివరించారు. యూనివర్సిటీ స్థాయి ర్యాంకులను సాధిస్తూ, ప్రముఖ మల్టీ నేషనల్స్ కంపెనీల్లో అద్భుత ఉద్యోగావకాశాలు పొందుతున్నారని తెలిపారు. 2024-25లో 417 ఉద్యోగాలు తమ విద్యార్థులు పొందారన్నారు. టిసిఎస్, విప్రో, ఇన్ఫోసిస్ వంటి ప్రముఖ కంపెనీల్లో రూ.2.5 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు వార్షిక వేతనంతో అత్యధిక ఉద్యోగాలు సాధిస్తున్న ఘనత తమ విద్యార్థులదని తెలిపారు. కళాశాల వదిలి బయటకు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఒక మంచి మల్టీ నేషనల్ కంపెనీల్లో మంచి ఉద్యోగం ఆదిత్యకే సాధ్యమని ప్రిన్సిపల్ ఘంటాపథంగా చెప్పారు.

కళాశాల ప్రత్యేకతలు

1.పటిష్టమైన విద్యాప్రణాళిక, విలువలతో కూడిన విద్యాబోధన, అత్యుత్తమ అధ్యాపక సిబ్బంది
2.ప్రత్యేక డిజిటల్ లైబ్రరీ, కాంపిటేటివ్ పరీక్షలకు, ఉన్నత విద్యకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో, కంప్యూటర్లతో అత్యాధునిక ల్యాబ్
4.మొదటి సెమిస్టర్ నుండే క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్, ప్రతివారం ఆన్లైన్ పోర్టల్లో పరీక్షా విధానం
5.మొదటి సెమిస్టర్ నుండే 'ప్రోగ్రామింగ్'లో శిక్షణ
6.సైన్స్ అండ్ టెక్నాలజీ వివిధ రంగాలకు సంబంధించిన గెస్ట్ లెక్చరర్స్, సైంటిస్టులతో సెమినార్స్
7.పియర్సన్ మెంప్రో ఇంగ్లీష్ శిక్షణతోపాటు వివిధ కంపెనీల నుండి ప్రతి సెమిస్టర్కూ రెండు సర్టిఫికెట్ కోర్సులు
8.నిరంతరం సిసి కెమెరా పర్యవేక్షణ
9.24/7 జనరేటర్ సదుపాయం
10.ఆర్ఓ మినరల్ వాటర్ ప్లాంట్
11.ఫీజు రీయంబర్స్మెంట్ సౌకర్యం
12.విద్యార్థుల్లో సామాజిక విలువలను పెంపొందించేలా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, ర్యాలీలు, పర్యావరణ దినోత్సవం, యాంటీ డ్రగ్స్ డే తదితర కార్యక్రమాలు

ఉపాధి హామీకి రూ.2.40 లక్షల కోట్లు పెంచాలి

వ్యవసాయ కార్మిక సంఘం

తాడేపల్లిగూడెం : ఉపాధి హామీకి రెండు లక్షల 40 వేల కోట్లు పెంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉపాధి పనుల పర్యటనలో భాగంగా శనివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఖండేల్లి సోమరాజు పెద్ద తాడేపల్లి ఉపాధి పనిప్రదేశం సందర్శించి, కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీని నీరు గార్చడానికి చూస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలు చెబుతూ వ్యవసాయ కూలీల పట్ల ప్రభుత్వాలకి శ్రద్ధ లేదని, గత సంవత్సరం ఇదే పనిలో ఒక ఉపాధి కూలీ గుండెపోటుతో చనిపోతే ఆయనకు రూపాయి కూడా ఇవ్వలేదని, మండుటెండలో మురుగు కాలవలు శుభ్రం చేస్తున్నా నిర్దిష్ట కూలి రూ.307 కూడా రావడం లేదని, జీవించడానికి రూ.307 కూలి ఏమి సరిపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూలి పెంచడానికి కృషిచేయాలని వారు కోరారు. సోమరాజు మాట్లాడుతూ ప్రభుత్వానికి ఉపాధి కూలీల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూమి రమేష్, పశుపతి రత్నం, శ్యాంబాబు, ఆలపాటి సత్యనారాయణ, కొమరం మేరీ రామ్మోహన్రావు, పెన్నాడ సుశీల, కోటిపల్లి సంతోష్, ఎర్రంశెట్టి లక్ష్మి, పచ్చిపురి లక్ష్మి, సానాపతి సత్యవతి మాట్లాడారు. **తణుకురూరల్** : వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ చట్టం జీవన భృతి కల్పిస్తుందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు అన్నారు. తేతలి గ్రామం కొండయ్యపాలెం వెళ్లే రోడ్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలను ఆయన శనివారం పరామర్శించారు. అనంతరం వీరభద్రరావు మాట్లాడుతూ మేడే దినోత్సవం సందర్భంగా మంగళగిరిలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఉపాధి కూలీలతో నిర్వహించిన ఆత్మీయ కలయిక సమావేశంలో ఉపాధి కూలీలకు రోజుకి రూ.307 చొప్పున అత్యధిక వేతనాలు చెల్లించే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్కళ్యాణ్ చెప్పడం అవాస్తవమన్నారు. దేశంలో కేరళ, హర్యానా రాష్ట్రాలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉండగా మన రాష్ట్రం 9వ స్థానంలో ఉందన్నారు. వ్యవసాయ రంగంలో కూలీలకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రోజుకు రూ.437 ఇవ్వాలని గత ఏడాది పార్లమెంటరీ స్థాయి సంఘం నివేదిక ఇచ్చిందని వీరభద్ర రావు గుర్తుచేశారు. అయితే అది కాగితాలకే పరిమితమైంది తప్ప ఆచరణకు నోచుకోకపోవడం శ్రమజీవులైన ఉపాధి కూలీల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మారే వీరస్వామి, గెడ్డం ప్రసాద్, గారపాటి రాజకుమారి, మారే ఉమా భవాని, మట్టా ధనలక్ష్మి, వీరవల్లి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

పాలకొల్లు రూరల్ : పాలకొల్లు మండలం పెదమామిడిపల్లి గ్రామానికి చెందిన నడిపూడి సుబ్రహ్మణ్యం ఇటీవల నర్సాపురం రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయనకు నడుము భాగం నుంచి పాదాల వరకు ఎముకలు విరిగిపోయాయి. ఆపరేషన్, వైద్య ఖర్చుల నిమిత్తం సుమారు రూ.3 లక్షల 50 వేలు అయ్యింది. ఈయన ఆర్థికంగా భరించలేని పరిస్థితిని తెలుసుకుని పెదమామిడిపల్లి గ్రామ మెగా ఫ్యాన్స్ చేబ్రోలు కృష్ణమోహన్ ఆధ్వర్యంలో జనసైనికులు కలిసి రూ.13 వేలు వైద్య ఖర్చుల నిమిత్తం నడిపూడి సుబ్రహ్మణ్యంకు రాష్ట్ర చిరంజీవి యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి తులా రామలింగేశ్వరరావు, చేబ్రోలు కృష్ణమోహన్, మాజీ ఎంపిటిసి గుబ్బల సత్యనారాయణ, పరిం నవీన్, శిడగం సురేంద్ర నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లిపూడి జగదీశ్, పరింవెంకట నవీన్, కడలి స్వామి వెంకటాద్రి, తమ్మినిడి వెంకటేశ్వరావు, గోగులమటం గణేష్, పరీం సాయి, వర్ధినీడి సూర్య(నాని), కలేపు చిట్టి కాసులు, కావూరు సాగర్, కాండ్రేగుల కిషోర్, దొంగ మల్లేశ్వరరావు, జక్కంశెట్టి జాకీ పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆలయ ఇఒ అరుణ్ కుమార్

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

కాళ్ల : కాళ్లకూరు గ్రామంలో స్వయంభూ శ్రీవెంకటేశ్వర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం మజ్జిగ వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. యాత్రికులకు మజ్జిగను అందించారు. ఈ సందర్భంగా ఆలయ ఇఒ అరుణ్ కుమార్ మాట్లాడుతూ వేసవి కాలంలో దేవాలయానికి వచ్చే యాత్రికులు, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రం దేవాదాయ శాఖ అధికారుల సూచనలతో దేవస్థానం తరపున ఏర్పాటు చేశామన్నారు. వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈనెల 6వ తేదీ మంగళవారం నుంచి 14 వరకు స్వామివారి వార్షిక తిరుకళ్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయన్నారు. ఈనెల 8వ తేదీ గురువారం రాత్రి ఉండి ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు దంపతులచే స్వామివారి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. ఈనెల 12వ తేదీ సోమవారం సాయంత్రం స్వామివారి దివ్య రథోత్సవం వైభవంగా జరుగుతుందని ఆలయ ఇఒ అరుణ్ కుమార్ వివరించారు. వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

లక్షా 50 వేల టన్నుల అదనపు ధాన్యం కొనుగోలుకు ప్రతిపాదన : జెసి

భీమవరం : జిల్లాకు 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేటాయించగా, ఇంకొక 1.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు అదనంగా కేటాయించాలని పౌర సరఫరాల సంస్థ ప్రధాన కార్యాలయం కోరడం జరిగిందని జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రబీలో రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయుటకు 263 రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రబీలో 9.25 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని, రైతులు అమ్ముటకు, సొంత అవసరాలకు నిల్వ ఉంచుకొనే ధాన్యం సుమారు 1.50 లక్షల టన్నులు ఉంటుందని తెలిపారు. ఇంకా 7.75 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయుటకు ప్రాథమికంగా అంచనా వేసినట్టు పేర్కొన్నారు. జిల్లాకు 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు నిమిత్తం కేటాయించడం జరిగిందన్నారు. రైతులు ఎవరూ ధాన్యం కొనుగోలు విషయంలో ఎటువంటి పుకారులను, అవాస్తవాలను నమ్మవద్దన్నారు. రైతులు ఎటువంటి దళారుల జోక్యం లేకుండా నేరుగా సంప్రదించాలన్నారు.

విశిష్ట సేవాతత్పరులకు ఎన్టీఆర్ కీర్తి పురస్కారాలు

భీమవరం టౌన్ : పద్మశ్రీ ఎన్టిఆర్ జయంతి వజ్రోత్సవాల్లో శనివారం విజయవాడ ఐలాపురం భవన్లో పిలాంద్ర ఫిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశిష్ట సేవాతత్పరులకు ఎన్టిఆర్ కీర్తి పురస్కారాలను అందించారు. వీరిలో భీమవరంకు చెందిన మాజీ కౌన్సిలర్ వాసర్ల ముత్యాలరావు, సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయిలకు ఎన్టిఆర్ కీర్తి పురస్కారాలను అందించి సత్కరించారు. శాసనమండలి సభ్యులు బుద్ధప్రసాద్, దుబాయ్ తెలుగు మహాసభల నిర్వాహకులు సిహెచ్.రాజశేఖర్, బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు హారిక, రచయిత కత్తిమండ పద్మాకర్, నిర్వాహకులు అద్దంకి రాజాల చేతుల మీదుగా పురస్కారాలను అందుకున్నామని వారు తెలిపారు.

పేదల ఇళ్ల తొలగింపును నిరసిస్తూ 6న బహిరంగ సభ

జయప్రదం చేయాలి : సిపిఎం

భీమవరం టౌన్ : పాలకోడేరు మండలం ఎఎస్ఆర్ నగర్లో పేదల ఇల్లు కూల్చివేతను నిరసిస్తూ 6వ తేదీ భీమవరంలో డిమార్ట్ దగ్గర సాయంకాలం 3 గంటలకు జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం భీమవరం రూరల్ వెంప గ్రామంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు ఆరునెలలుగా పేదల ఇళ్లను కూల్చివేస్తూ నిరాశ్రయులను చేస్తున్నారన్నారు. వారికి ప్రత్యామ్నాయంగా ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణాలు నిర్మించకుండానే కూల్చి వేస్తున్నారన్నారు. దీనిని ప్రజలందరూ అడ్డుకోవాలని అన్నారు. ప్రభుత్వ పోరంబోకు స్థలంలో ఇల్లు నిర్మించుకున్న వారందరి పరిస్థితి ఇదే అవుతుందన్నారు. ఇల్లు కోల్పోయి గూడు చెదిరి, రోడ్ల పాలైన పేదలకు అండగా, మద్దతుగా భీమవరంలో జరిగే బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భూపతి సామేలు, చిలకపాటి ఆనంద్ రావు, మీసలకు ప్రసన్న, మంద శిరోమణి, చిలకపాటి శకుంతల, మంద మార్తమ్మ, పెద్దిరాజు, కాటికి సుందర్రావు పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణకు అధిక ప్రాధాన్యత

రైతులకు 55 వ్యవసాయ యంత్ర పరికరాలను అందించిన ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్



పరికరాలను అందజేస్తున్న ఎంఎల్ఎ

వ్యవసాయంలో అధునాతన సాంకేతిక పద్ధతులను అనుసరించేందుకు రైతులకు యాంత్రీకరణ పరికరాలను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం మార్కెట్ యార్డ్లో భీమవరం నియోజకవర్గ స్థాయిలో 55 వ్యవసాయ యంత్ర పరికరాలను శనివారం ఆయన పంపిణీ చేశారు. ప్రభుత్వం యంత్ర పరికరాలపై సబ్సిడీలు అందిస్తుందని, రైతులు ఈ సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వ్యవసాయంలో రైతులకు యంత్ర పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, వ్యవసాయ యాంత్రీకరణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. వ్యవసాయానికి ఉపయోగపడే ట్రాక్టర్లు, పవర్ స్ప్రేయర్లు, టార్పాలిన్లు వంటి యంత్ర పరికరాలకు ప్రభుత్వం రాయితీపై అందిస్తుందన్నారు. భీమవరం మండలంలో 33 పరికరాలు, వీరవాసరం మండలంలో 22 పరికరాలు మొత్తం రూ.27 లక్షల 70 వేల రాయితీతో 55 వ్యవసాయ యంత్ర పరికరాలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, భీమవరం, వీరవాసరం కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎపిలో రౌడీ పాలన

వైసిపి నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు

కాళ్ల : ఎపిలో కూటమి ప్రభుత్వం అనేక అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, ప్రస్తుతం రాష్ట్రంలో మట్టి, గ్రావెల్ మాఫియాలతో రౌడీ పరిపాలన చేస్తున్నారని నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. పెదఅమిరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో జిల్లా సమన్వయ కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ వైసిపి ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని, ప్రజలు అధైర్యపడవద్దన్నారు. పార్టీలో కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని, పార్టీకి 2019 నాటి పునర్వైభవం వస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ సంస్థాగతంగా పార్టీ పునర్నిర్మాణం చేస్తూ ప్రజల పక్షాన పోరాటాలు చేస్తామని తెలిపారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో కమిటీలు పూర్తిచేశామని, రానున్న రోజుల్లో గ్రామ, బూత్ స్థాయిలో కమిటీలు వేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 10 నెలలు గడుస్తున్నా ఒక్క అభివృద్ధి జరగలేదన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. గ్రామాల్లో చాలా ధాన్యం ఉండిపోయిందని, అది కొంటారో లేదో అని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇంకోవైపు ఆక్వా రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. రైతులు, ప్రజల పక్షాన వైసిపి నిలుస్తుందన్నారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరావు మాట్లాడుతూ రైతులకు న్యాయం చేస్తామని ప్రగల్భాలు పలికిన సివిల్ సప్లయ్ మంత్రికి ఇక్కడ రైతుల కష్టాలు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కనీసం రైతులకు సంచులు కూడా ఇవ్వలేని పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు. అమరావతి పున్నప్రారంభం సభలో ప్రధానమంత్రి మోడీ పెద్ద హామీలు ఇస్తారని అందరూ ఆశించారని, ఆయన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్కి ఒక చాక్లెట్ మాత్రం ఇచ్చి పంపారన్నారు. గతంలో కూడా మట్టి, నీరు ఇచ్చిన సంగతిని ఈసందర్భంగా ఆయన గుర్తుచేశారు. అనంతరం జిల్లా పరిశీలకులు మురళీకృష్ణంరాజుని ఘనంగా సత్కరించారు. ఎంఎల్సి కౌరు శ్రీనివాస్, పివిఎల్.నరసింహారాజు, గుడాల గోపీ, పేరిచర్ల విజయనరసింహారాజు పాల్గొన్నారు.

అధ్యయనం పెంపునకు శిక్షణా తరగతులు దోహదం : ఎంఎల్సి

భీమవరం : కార్యకర్తల అధ్యయన స్థాయిని పెంచేందుకు శిక్షణ తరగతులు దోహదపడతాయని టీచర్ ఎంఎల్సి బొర్ర గోపీమూర్తి అన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ భవనంలో యుటిఎఫ్ జిల్లా శిక్షణ తరగతులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఎల్సి గోపీమూర్తి మాట్లాడుతూ శిక్షణా తరగతులు కార్యకర్తల అధ్యయన స్థాయిని పెంచడానికి, చైతన్యవంతులను చేయడానికి క్రియాశీలకంగా మారడానికి ఉపయుక్తంగా ఉంటాయన్నారు. జిల్లాలోని 25 యుటిఎఫ్ శాఖల నుంచి ఎంపిక చేసిన దాదాపు 110 మంది కార్యకర్తలు ఈ తరగతులకు హాజరయ్యారు. జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభి రామయ్య, సహాధ్యక్షులు కె.రాజశేఖర్, కోశాధికారి పి.క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలగా జగన్నాధపురం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలో జెడ్పి ఉన్నత పాఠశాలలు 10, ప్రాథమిక ఉన్నత పాఠశాలలు 4, ప్రాథమిక పాఠశాలలు 68 ఉన్నాయి. ప్రభుత్వం చేపట్టిన ఆదర్శ పాఠశాల విధానాన్ని జగన్నాధపురంలో అమలు చేపట్టారు. జగన్నాధపురంలోని ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులు 12 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆ పాఠశాలకు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు చదువుతున్నారు. జగన్నాధపురం పాఠశాలను ఆదర్శ పాఠశాలగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు.

లిటిల్ గేమ్స్ ప్లే స్కూల్ ప్రారంభం

భీమవరం టౌన్ : విద్యార్థులకు సమగ్ర విద్య అందించాలని, పచ్చని వాతావరణంలో ప్లే స్కూల్ను ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం డిఎన్ఆర్ కళాశాల రోడ్డులో శనివారం లిటిల్ గేమ్స్ ప్లే స్కూల్ను ఆయన ప్రారంభించారు. ఉపాధ్యాయులు మెరుగైన విద్యను అందించి విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేరేలా కృషిచేయాలన్నారు. ప్లే స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్లు రామ్ ప్రకాష్, మణికంఠ, తేజ, రవి మహేష్ కుమార్ మాట్లాడుతూ అనుభవం, అంకిత భావం కలిగిన ఉపాధ్యాయులచే విద్యాబోధన అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యడ్లపల్లి సత్యనారాయణ, ఏడుకొండలు, జనసేన నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, కారుమూరి సత్యనారాయణ మూర్తి, పత్తి హరివర్ధన్, యర్రంశెట్టి శివకృష్ణ పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలని వినతి

భీమవరం : అమలు కానీ హామీలు ఇచ్చి రైతులను కూటమి ప్రభుత్వం అన్ని విధాల మోసం చేసిందని వైసిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు విమర్శించారు. రైతాంగ సమస్యలను పరిష్కరించాలని స్థానిక కలెక్టరేట్లో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి పది నెలలు గడుస్తుందని ఈ కాలంలో ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. మాజీ మంత్రులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 9 లక్షల 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిస్తుంటే ప్రభుత్వం కేవలం 6 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే లక్ష్యంగా పెట్టి కొనుగోలు చేయడం సిగ్గుచేటు అన్నారు. వినతిని అందించిన వారిలో ఎంఎల్సి కౌరు శ్రీనివాస్, పివిఎల్.నరసింహారాజు, గుడాల గోపి, పేరిచర్ల నరసింహారాజు, బంధన పూర్ణ ఉన్నారు.